క్లుప్తంగా

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

తలమడుగు: పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో ప్రణీత అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల, బరంపూర్ జెడ్పీ పాఠశాలల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకట్‌రావు, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వాణీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పక్షుల దినోత్సవం



నీటితొట్టెలు ఏర్పాటు చేస్తున్న ప్రిన్సిపాల్

బోథ్: మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో పక్షుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. పక్షి ప్రేమికుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రకృతితో పాటు పక్షులను కాపాడాలన్నారు. వేసవి కాలంలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు ఇళ్లల్లో, పాఠశాలల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని చెట్లపై నీటి తొట్టెను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు సంతోష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భూమారెడ్డి వర్ధంతి

ఇచ్చోడ: మండలంలోని బోరిగామలో శుక్రవారం తెలంగాణ అమరవీరుడు భూమారెడ్డి 13వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన భూమారెడ్డి త్యాగం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొలాంగూడలో సికిల్ సెల్ శిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని కొలాంగూడలో శుక్రవారం సికిల్ సెల్ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజల రక్త నమునాలు సేకరించి వైద్య పరీక్షలు చేశారు. మండల వైద్యాధికారి సర్ఫారాజ్ మాట్లాడుతూ.. రక్త హీనతతో బాధపడుతున్న వారు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకు మాత్రలు వేసుకోవాలన్నారు. పబ్లిక్ హెల్త్ నర్స్ శ్యామల, ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు ఈశ్వర్ దేవి, వేణుతాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండకు చేరుకున్న పాదయాత్ర

నేరడిగొండ: నిజామాబాద్ జిల్లా నుంచి ధర్పెల్లి మండలం దమనపేట్ గ్రామం నుంచి పౌరదేవి (రామారావు మహరాజ్) వరకు రాజేశ్వర్ అనే యువకుడు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఆయనకు గ్రామస్తులు వసతి కల్పించారు. పాదయాత్ర విజయవంతం కావాలని కాంక్షించారు. కార్యక్రమంలో రాథోడ్ సురేందర్, రాథోడ్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'సఖీ' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ లావణ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో మగ్గం వర్క్, బ్యూటీషియన్ పార్లర్ శిక్షణ కేంద్రంలో అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం ద్వారా అందే కౌన్సెలింగ్, న్యాయ, పోలీసు సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి వివరించారు. మహిళలు, బాలికల చట్టాలు, గృహహింస, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, సైబర్‌క్రైం గురించి వివరించారు.

రేపు డీటీయూ ఆవిర్భావ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ధర్మ టీచర్ యూనియన్ ఆవిర్భావ సభ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు కమిటీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రమేశ్ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో ఆవిర్భావ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా టీచర్ యూనియన్ ఆవిర్భావ శిలాఫలకాన్ని బోధన్‌లో ప్రారంభించడం జరిగిందన్నారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అశ్విని, నగేశ్, నారాయణ, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపైనే ఆశలు

- కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభలు
- భారీగా దరఖాస్తులు



ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సిరికొండ: ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలు ఏర్పాటు చేసి ఆయా పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. దీంతో గ్రామాల్లో భారీగా దరఖాస్తులు వస్తున్నాయి.

వెల్లువెత్తిన దరఖాస్తులు

ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలపై దరఖాస్తు చేసుకోవాలని గత నెల 28 నుంచి ప్రతీ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా సుమారుగా 4500 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈసంఖ్య పెరిగే అవకాశం ఉంది.

దరఖాస్తుల స్వీకరణ..

మహాలక్ష్మి పథకం కింద ప్రతీ నెల రూ. 2500, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15, 000, రైతు కూలీలకు రూ.12000, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికుల నూతన పింఛన్ అందించేందుకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

సొంత గూటి కోసం ఎదురుచూపులు..

ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న పథకం ఇందిరమ్మ ఇళ్ల పథకం. మండలంలో అనేక మంది ఇళ్లు లేని వారు ఉండడంతో ఈ పథకంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఇందిరమ్మ పథకం కింద రూ. 5 లక్షలతో ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుందని చాలా మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇల్లు మంజూరు చేయాలి



మాకు గ్రామంలో ఉండేందుకు సరైన ఇల్లు కూడా లేదు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయాలి. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదు.

– బోంతల మల్లమ్మ, సిరికొండ

పింఛన్ రావడం లేదు



నా భర్త మరణించి పది ఏళ్లు అవుతుంది. నాకు ఇప్పటి వరకు వితంతు పింఛన్ రాలేదు. గతంలో చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా కానీ రాలేదు. ఇప్పుడు కూడా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా.

– గోగుల లక్ష్మి, సిరికొండ

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



ప్రజాపాలనా గ్రామసభల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతీ గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేశాం. దరఖాస్తుల తీరును అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– పి.సురేశ్, ఎంపీడీవో, సిరికొండ

ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించాలి



తాంసి: దరఖాస్తు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ రాజు



నార్నూర్: ఎంపల్లిలో..



ఇచ్చోడ: మాట్లాడుతున్న ఎంపీడీవో రాంప్రసాద్

తాంసి: ప్రతీ కుటుంబం నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించాలని జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని కమట్‌వాడ గ్రామంలో సర్పంచ్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిదాసు, ఎంపీవో వినోద్, హెచ్ఈవో జ్ఞానేశ్వర్, కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

అంబుగాంలో..

తాంసి మండలంలోని అంబుగాం గ్రామంలో ఎంపీడీవో భూమయ్య దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకునే వారు ఉంటే 6తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ తుర్పాబాయి, ఆర్ఐ మహేందర్, ఎంపీవో సుధీర్ రెడ్డి, మేఘరాజ్, సూపర్ వైజర్ తులసీరాం పాల్గొన్నారు.

నార్నూర్: దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపల్లిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆమె వెంట సర్పంచ్ రాథోడ్ గోవింద్, తదితరులు ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ గ్రామాల్లో కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని శ్యాంపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ప్రజల నుంచి ఎంపీడీవో తిరుమల, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో మహేశ్, ఎంపీపీ జైవంత్‌రావు దరఖాస్తులు స్వీకరించారు.

తలమడుగు: మండలంలోని ఖోడద్, ఉండమ్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శుక్రవారం 650 దరఖాస్తులు వచ్చాయి. దళారులను నమ్మి మోసపోవద్దని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ రాజ్‌మోహన్, సర్పంచ్ పోచ్చుబాయి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రఫీ, వెంకన్నయాదవ్ పాల్గొన్నారు

ఇచ్చోడ: జామిడిలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో రాంప్రసాద్, బోరిగామలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ తుకారాంలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తామన్నారు. దరఖాస్తులు చేసుకొని వారు 6 లోపు పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'లింగ వివక్షతను రూపుమాపాలి'



అవగాహన కల్పిస్తున్న జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి

ఆదిలాబాద్‌టౌన్: లింగ వివక్షతను రూపుమాపాలని మహిళ సాధికార జనశిక్షణ సంస్థ జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ కాలనీలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం, ఉన్నత చదువులు చదవడంతోనే మహిళ సాధికారత సాధించవచ్చన్నారు. గృహహింస చట్టం, గర్భ నిర్ధారణ చట్టం, పీసీపీ ఎన్‌డీటీ యాక్ట్, సైబర్‌క్రైం, వరకట్న వేధింపులు చట్టాల గురించి వివరించారు. మహిళలు ముద్రయోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

తలమడుగు: మండలం రుయ్యాడి గ్రామంలో హస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కొండూరు గంగాధర్‌ని దేవస్థాన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పూంద్రు పోతారెడ్డి, దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షుడు చిన్న గోక వెంకట్‌రెడ్డి, మోతి శ్రీనివాస్, రామకృష్ణ, గోక ప్రకాష్‌రెడ్డి, నిట్టడి గంగాధర్, గంగారెడ్డి, శివయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందిస్తాం

బోథ్: ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామీణ నీటిపారుదల కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం కరత్వాడ వద్ద గల మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. కంద్రవాగు వద్ద వంతెన నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీఈ దేవయ్య, ఏఈ కల్యాణ్‌లు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం జిల్లా డైరెక్టర్‌గా పోశెట్టి

బోథ్: గంగపుత్రం సంఘం జిల్లా డైరెక్టర్‌గా బోథ్ మండల కేంద్రానికి చెందిన పందిరి పోశెట్టి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బోథ్ మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలకు చెందిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించడంతో పాటు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఇచ్చోడ: ఇచ్చోడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రాక

బోథ్: మండలంలోని కండిపల్లె గ్రామంలో శ్రీసంత్ రామారావ్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం రానున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బంజారా సమాజ్, ఆయా గ్రామస్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమం అనంతరం కండ్రివాగుపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న గజేందర్

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో క్రికెట్ పోటీలను కాంగ్రెస్ నాయకులు ఆడె గజేందర్ శుక్రవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటగాళ్ల ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో చంటి, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్, సంజీవ్, రమేశ్, వినయ్ రెడ్డి, అభిలాష్‌రెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీకాంత్

తాంసి: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈవో శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడి బోధన తీరును తెలుసుకున్నారు. సిలబస్ పూర్తి చేసేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి సౌజన్యను ఆదేశించారు. కేజీబీవీ సిబ్బంది సంగీత, శ్రీవిద్య, రమ, సుజాత పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పిన్నంవార్ రాజేశ్వర్

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఈనెల 7న నిర్వహించే అఖిల గాండ్ల తేలికుల సంఘం ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పిన్నంవార్ రాజేశ్వర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంతో పాటు నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం, క్యాలెండర్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ సోయం బాపూరావు, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కుల సంఘం పెద్దలు, నాయకులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి తమ్మలవార్ చందు, గౌరవ అధ్యక్షుడు ఆసపు విలాస్, ప్రమోద్, దినేష్, మహేష్, నిహాల్, స్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: సంక్షేమ పథకాలను వంద రోజుల్లో కచ్చితంగా అమలు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నా రు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్‌లో ప్రజా పాలన గ్రామ సభలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రతీ పేదవాడికి స్వయంగా ప్రభుత్వ పథకం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ దరఖాస్తులు స్వీకరిస్తుందన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, జెడ్పీటీసీ పుష్పలత, కేస్లాపూర్ సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, మెస్రం తుకారం, మడావి భీంరావ్ పాల్గొన్నారు.

ఇంటింటా అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న యువకులు

తాంసి: అయోధ్య రామాలయ అక్షింతలను మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటా పంపిణీ చేశారు. మండలంలోని కప్పర్ల, జామిడి, వడ్డాడి, పొన్నారితో పాటు పలు గ్రామాల్లో గడపగడపకు అయోధ్య కరపత్రంతో పాటు అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేరడిగొండ: రామ జన్మభూమి అయోధ్యలో ఈనెల 22న ప్రారంభం కానున్న రామ మందిర పూజిత అక్షింతలు, శ్రీరాముని ఫొటో, మందిర నిర్మాణ విశిష్టతలను తెలిపే కరపత్రాలను ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లి హనుమాన్ ఆలయాల వద్ద వాటిని గ్రామ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో సాబ్లే సంతోష్ సింగ్, లింగాల సంతోష్ గౌడ్, సోలంకి సాయి కిరణ్, తగిరే సుందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేజాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను అధికారులతో కలిసి స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజల వద్దకే పాలన సాగించాలని పేర్కొన్నారు. తేజాపూర్ నుంచి నేరడిగొండ వెళ్లేందుకు నూతన రోడ్డు నిర్మాణానికి రూ.43 లక్షల వ్యయంతో భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఎంపీపీ రాథోడ్ సజన్, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, అల్లూరి శివారెడ్డి, ఏలేటి రవీందర్ రెడ్డి, పండరి, సాబ్లే నానక్‌సింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఇచ్చోడ: ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయనున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇచ్చోడ తండాలో జగదాంబదేవి సేవలాల్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆలయాలు ఉంటే ఆ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు గాడ్గే సుభాష్, పాండురంగ్, సర్పంచ్ చౌహన్ సునీత పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గుడిహత్నూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్కాపూర్‌లో ఏర్పాటు చేసిన కుమురం భీం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, నాయకులు వాగ్మారే శైలేందర్, ప్రతాప్ సింగ్, సలీంఖాన్, మాధవ్ కేంద్రే, తొడసం మహేష్, ఉయిక లక్ష్మణ్, కోవ భగవాన్, మాధవ్ తెలంగే, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీపీఐ జాతీయ కార్యదర్శిని కలిసిన నాయకులు

ఎదులాపురం: హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ కార్యదర్శి నారాయణను జిల్లా నేతలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు నళినీరెడ్డి, అరుణ్ కుమార్, కుంటాల రాములు, షేక్ పాషా, అర్గాంగి రమేశ్, అమీనా బేగం ఉన్నారు.

ఎంపీని కలిసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: రాజ్యసభ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మణ్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం తొలిసారిగా ఆయనను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు.

ఉజ్వలయోజన సిలిండర్ల పంపిణీ

తాంసి: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల యోజనలో భాగంగా అందిస్తున్న గ్యాస్ సిలిండర్లను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉజ్వల యోజన గ్యాస్ స్టవ్, సిలిండర్లు మహిళలకు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే నలభై మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నార్నూర్: మండలంలోని ఉమ్రీ పరిధిలోని చిత్తగూడ గ్రామంలో నవతరం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బిరుదుల ప్రవీణ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేదలకు చేయూతనందించాలనే ఉద్దేశంతో ముందుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చారి, రాకేశ్, ఉదయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ఉట్నూర్‌రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గల వికాసం పాఠశాలలో కాంగ్రెస్ నాయకులు సయ్యద్ నిసాదర్, సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ కరీంలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫైడ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దూట రాజేశ్వర్, బిరుదుల లాజర్, సలీం, మహిమూద్, ఇమ్రాన్, సలీం, అచ్చనందం, ఘన్పూర్, భాగ్యలక్ష్మి, అనూష, రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు.